క్లుప్తంగా

వేంకటాచలస్వామికి పుష్పయాగం



తిరువూరు: స్థానిక పాతతిరువూరులో వేంచేసిన వేంకటాచలస్వామికి ఆదివారం కార్తీక మాస సందర్భంగా పుష్పయాగం నిర్వహించారు. స్వామికి తొలుత ఆ స్తోత్ర శతనామాలతో విశేష పూజలు చేసిన అర్చకులు భక్తులు సమర్పించిన పలు రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు వేణు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వన సమారాధనకు వెళ్లిన నాయకులు

మైలవరం: మాదిగల ఆత్మీయ వన సమారాధనకు మైలవరం మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మైలవరం నియోజకవర్గ స్థాయిలో విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలోని రాజు మామిడి తోటలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. మైలవరంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలను తరలించేందుకు బస్‌లు ఏర్పాటు చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



నెమలి(గంపలగూడెం): కార్తికమాసం సందర్భంగా నెమలిలో ఆర్యవైశ్యసంఘం మండలం, గ్రామశాఖల ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. గ్రామంలోని మామిడి తోటమూలో నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. 60 మంది దంపతులు వ్రతాన్ని ఆచరించారు. ఆర్యవైశ్యసంఘం మండల అధ్యక్షుడు చిన్నసత్యంబాబు, మాజీ అధ్యక్షులు రామాంజనేయులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎలీషాకు జాతీయ సేవారత్న అవార్డు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషాకు క్రైస్తవ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ సేవారత్న అవార్డు లభించింది. గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు విజయవాడలోని కాగూర్ గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందించి సత్కరించారు. కార్యక్రమ ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, అకాడమీ అధ్యక్షుడు ప్రభాత్, చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, రాజేంద్రప్రసాద్, మోజెస్, అనిల్ పాల్గొన్నారు.

20నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు



మైలవరం: తిరుమల తిరుపతి దేవస్థానాలు, మనగుడి కార్తీక మాసోత్సవాల్లో భాగంగా మైలవరం శివాలయంలో ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ప్రతి రోజూ సాయంత్రం 6.30గంటల నుంచి 9గంటల వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కార్తీక మాస కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ద్వారా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకర రావు ఆవిష్కరించారు.

సామూహిక సీమంతాలు



విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి బాబా సేవాసమితి ఆధ్వర్యంలో సత్యసాయి సేవామందిరంలో గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సత్యసాయిబాబా జన్మదిన వేడుకల సందర్భంగా 12 మంది గర్భిణులకు సీమంతాలు ఎంపీటీసీ పిల్లి మెర్సీవసంతలక్ష్మి చేతుల మీదుగా నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి విస్సన్నపేట కన్వీనర్ జె రంగారెడ్డి, మహిళా కన్వీనర్ శ్రీలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి



పెనుగొలనులో ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



నూజివీడు గ్రంథాలయంలో మాట్లాడుతున్న వైద్యురాలు లక్ష్మీదుర్గాంబ



మైలవరంలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న గ్రంథాలయ సిబ్బంది



విస్సన్నపేటలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

నూజివీడు: విద్యార్థులు చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని వైద్యురాలు బొప్పన లక్ష్మీదుర్గాంబ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయిని అనురాధ మాట్లాడుతూ మహిళా సాధికారితకు ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నందూరి పద్మాంజలి, శ్రీ సత్య నృత్య అకాడమీ నిర్వాహకులు వేంపాటి మోహన్, రిటైర్డ్ ఎంఈఓ గోవిందరావు, గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మునుసూరు: గ్రంథాలయాల్లో స్ఫూర్తి, పోటీతత్వానికి గ్రంథాలయాలే పునాది అని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గోపవరం బ్రాంచి గ్రంథాలయాధికారి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

గొల్లపల్లిలో...

మండలంలోని గొల్లపల్లిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలచట్టం గురించి సచివాలయ ఎంఎస్కేలు అనూష, పవిత్ర విద్యార్థులకు వివరించారు. అనంతరం గొల్లపల్లి హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు

పెనుగొలను(గంపలగూడెం): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలనుశాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. పలువురు బాలికలు పోటీలో పాల్గొని వివిధ రకాల రంగవల్లులను వేసి రంగులు దిద్దటంతో చూడముచ్చట గొల్పింది. ముందుగా వీరనారి ఝాన్సీలక్ష్మీబాయి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ జరిపారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, ప్రగతి కాన్వెంట్ ప్రిన్సిపాల్ కోటేశ్వరం, గ్రంథాలయ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం లైబ్రేరియన్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించారు. దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలికలకు రంగవల్లి పోటీలు నిర్వహించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మైలవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని మైలవరం శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కోయ సుధ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలని, తమ పిల్లలను విద్యావంతులను చేయాలన్నారు. స్థానిక రాజ్యలక్ష్మీ అపార్ట్‌మెంట్స్ వద్ద మహిళలు రంగవల్లుల పోటీల కార్యక్రమం నిర్వహించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ రాబర్టు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో బ్రెయిన్‌స్ట్రోక్ నివారణ

న్యూరాలజిస్ట్ రాజేశ్వరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యూరాలజిస్ట్ రాజేశ్వరి

తిరువూరు: సిగరెట్, మద్యపానం వంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా, మానసిక ఒత్తిడిని అధిగమిస్తూ ముందస్తు వైద్యపరీక్షలు చేయించుకుంటే బ్రెయిన్ స్ట్రోక్ రాకుండా జాగ్రత్త పడవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ రాజేశ్వరి సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం బ్రెయిన్ స్ట్రోక్-నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్నా, తల తిరుగుతున్నట్లున్నా వైద్యులను సంప్రదించి పూర్తిస్థాయి వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. తగిన సమయంలో వైద్యసేవలు పొందితే బ్రెయిన్ స్ట్రోక్ నియంత్రించవచ్చన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళనను గురికాకుండా ప్రశాంత తను అలవరచుకోవాలని సూచించారు. ప్రముఖ వైద్యులు రవీంద్ర, జేవీవీ ప్రతినిధులు సుధాకర్, సుదర్శన్, గంగాధర్, హరికృష్ణ, వినయ్‌కుమార్, రాంప్రదీప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాలు సద్వినియోగం చేసుకోండి

ఐలా చైర్మన్ రామలింగేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న రామలింగేశ్వరరావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సబ్సిడీలు సద్వినియోగం చేసుకోవాలని ఐలా చైర్మన్ ఎంబీ రామలింగేశ్వరరావు అన్నారు. కెవిల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎంటర్‌ప్రైజెస్ స్టార్ట్ అప్ ప్రోగ్రాంపై అవగాహన సదస్సు కొండపల్లి ఐడీఏలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఎంఎస్ఎంఈల ద్వారా సకాలంలో ఉపయోగించుకుని వ్యాపారంలో అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎం డీఓ్కఓ డీఏఎస్ ఆర్.మూర్తి, డాక్టర్ రాఘవరావు, ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



మైలవరంలో నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమాన్ని మైలవరంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

కొండపల్లిలో..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం కొండపల్లిలో ఆదివారం జరిగింది. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ స్థానిక నాయకులతో కలసి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

తిరువూరులో..

తిరువూరు: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఇందిరమ్మ చిత్రపటానికి గ్రంథాలయాధికారి పద్మావతి, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో మహిళా దినోత్సవాన్ని జరిపారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు.

ఏపీపీ ఎస్ఏ ఖాన్ మృతి



ఎస్ఏ ఖాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ప్రముఖ న్యాయవాది, 15వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ ఎస్ఏ ఖాన్(సయ్యద్ అహ్మద్ ఖాన్)(64) ఆదివారం హఠాన్మరణం చెందారు. ఇంటి వద్ద మధ్యాహ్నం భోజనం చేసిన ఖాన్ ఆ తరువాత కొద్దిసేపటికి ఛాతిలో నెప్పిగా ఉందంటూ భార్యతో చెప్పి, కొద్దిసేపటికి బాత్‌రూమ్‌కు వెళ్లాడు. అయితే పావుగంట తరువాత భార్య చూడగా బాత్‌రూమ్ దగ్గర్లో పడిపోయి ఉన్నారు. దీంతో ఆయన్ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. ఖాన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్ఏ ఖాన్ భౌతికకాయానికి నివాళులు

నూజివీడు: ఏపీపీ ఎస్ఏ ఖాన్ భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

దేశ ప్రగతిలో మహిళల పాత్ర చిరస్మరణీయం

విజయవాడ కల్చరల్: దేశ ప్రగతిలో మహిళల పాత్ర చిరస్మరణీయమైనదని ఏపీబీడీసీ చైర్‌పర్సన్ బండి పుణ్యశీల అన్నారు. పోలుకొండ మంగ తాయారు స్మారక సాహిత్యసేవా సంస్థ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో మహిళా సాధికారిత అంశంగా కార్యక్రమం నిర్వహించారు. పుణ్యశీల మాట్లాడుతూ పురాణకాలం నుంచి కూడా మహిళలు సాంస్కృతిక, రాజకీయ, కళారంగాలలో తమ ప్రతిభను చాటుకుని విజయకేతనం ఎగురవేస్తున్నారన్నారు. సరోజనీనాయుడు, రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి వంటి మహిళామణుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. సభలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమలపూర్ణమ్మ, రైటర్స్ అకాడమీ ప్రతినిధి శైలజ ప్రసంగించారు. సంస్థ వ్యవస్థాపకురాలు వి.ఉమామహేశ్వరి కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాసరచన పోటీలో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన స్వీయ కవితా పఠనానికి వి.సుధారాణి అధ్యక్షత వహించారు.

నేడు 'స్పందన'

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే విద్యాశాఖలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో..

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ అదిత్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

నేడు పల్లెకు పోదాం కార్యక్రమం

విస్సన్నపేట: మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయం-1 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమం సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ ఆదివారం తెలిపారు. సంబంధిత అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని పేర్కొన్నారు.

■ ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం మండలంలోని నరసాపురం సచివాలయం-1 పరిధిలో సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి తెలిపారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బాబూరావు



నూజివీడు: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బొద్దు కోళ్ల బాబూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం రాత్రి మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మల్లెల చెన్నకేశవరావు, ఆర్థిక కార్యదర్శిగా చిన్నం సంపత్ కుమార్‌లు ఎన్నికయ్యారు. అలాగే 19 మంది మండల కమిటీ సభ్యులు, 13 జిల్లా కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆది దంపతులు ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కళ్యాణంతో పాటు ఉపాలయంలో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, త్రికాల అభిషేకాలతో పాటు సహస్ర లింగార్చన, సాయంత్రం ఊంజల్ సేవ, దీపార్చన, పల్లకీ సేవల్లో కూడా భక్తులు భారీగా పాల్గొన్నారు.

సూర్యోపాసన సేవ

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం ప్రతిష్ఠా మహోత్సవం



శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



జి.కొండూరు శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

జి.కొండూరు: జి.కొండూరులో నూతనంగా నిర్మించిన పార్వతీదేవి సమేత అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ శివుని అనుగ్రహంతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

మైలవరం: గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఈ నెల 26న జరిగే రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు బుద్ధవరపు వెంకట్రావు తెలిపారు. మైలవరం రజక సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకులకు రానున్న ఎన్నికల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ మైలవరం మండలం చంద్రగూడెం, మైలవరం, గ్రామాల్లో శనివారం, ఆదివారం రజక కార్యకర్తలతో పోస్టర్ ఆవిష్కరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది రజకులతో రజక ఆత్మ గౌరవ మహాసభ నిర్వహించనున్నట్లు వెంకట్రావు తెలిపారు. రజకులకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉన్న నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, ఎస్సీ జాబితాలో చేర్చాలని, రజకుల రక్షణ చట్టం అమలు చేయాలని కోరారు. మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు తాళ్లూరి శేషగిరిరావు, గవ్వలపల్లి చంద్రశేఖర్, అర్జునరావు, గోపాల్‌రావు, చెన్నారావు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

ఆగిరిపల్లి: పాతపాటి అంజిబాబు ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఈ నెల 26న నిర్వహించే రజక ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని, రజక ఐక్యవేదిక సంఘాల నాయకుడు శేషగిరిరావు కోరారు. ఆగిరిపల్లిలో రజక సంఘం నాయకులతో కలిసి ఆదివారం రజకుల ఆత్మగౌరవ మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుందేటి వీరవెంకటేశ్వరరావు, కొండపల్లి తిరుపతిరావు, ఆసానుబాదు శంకర్రావు, చిట్టేల శివరామకృష్ణ, నైనవరపు బాబు పాల్గొన్నారు.

రామెళ్ల బాబురావు మృతి పార్టీకి తీరని లోటు



బాబురావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్

రెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రామెళ్ల బాబురావు మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు. రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడికి ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స చేశారు. ఆయన కోలుకునే లోపే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ కూనపరాజుపర్వ గ్రామానికి వెళ్లి బాబూరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు. బాబూరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, మండల సచివాలయ కన్వీనర్ భరతేశుమార్‌రెడ్డి, రైతు సంఘం మండలి అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు చిత్రలేఖనం దోహదం



విజేతలకు బహుమతులను అందజేస్తున్న అతిథులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మనిషిలోని భావాలను వ్యక్తపరచడానికి చిత్రలేఖనం దోహదం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ రిటైర్డ్ కమిషనర్ కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ, అనంత్ డైమండ్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (స్పా) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగిన డ్రాయింగ్ పోటీలో విజేతలకు ఆదివారం స్పా కళాశాల ఆవరణలో బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుందని, దానిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు ఆ రంగంలో అగ్రస్థాయికి చేరతారన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల డ్రాయింగ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అనంత్ డైమండ్స్ అధినేత జాస్తి అనంత పద్మ శేఖర్ మాట్లాడుతూ డ్రాయింగ్ ద్వారా పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు పి.రమేష్ మాట్లాడుతూ చిన్నారుల్లో డ్రాయింగ్‌పై మక్కువ పెంచడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత నారాయణరావు, స్పా కళాశాల స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ ఎస్.వెంకట కృష్ణ కుమార్, రాజముద్ర చిత్రకళానికేతన్ కార్యదర్శి టి.మృత్యుంజయ రావు, ఆకాంక్షా నివాల్ ఆర్ట్ సొసైటీ కోఆర్డినేటర్ వి.వి.రమ్య, జిజ్ఞాస ఇంటర్ పీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ వై.భార్గవ్, ఎస్.రవికుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. సభకు ముందుగా అతిథులను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

పైర్ల సాగులో సూచనలు పాటించాలి

కొత్తపల్లి(గంపలగూడెం): వివిధ రకాల పైర్లసాగు విషయమై రైతులకు వ్యవసాయంలో కొత్తపద్ధతులు, వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని తప్ప ఇష్టానుసారంగా మందులు, ఎరువులు వినియోగించవద్దని ఏలిస్ ఆగ్రో లిమిటెడ్ జనరల్ మేనేజర్ రాకేష్ తెలిపారు. ఏలిస్ ఆగ్రో కంపెనీ ఎరువుల ఉత్పత్తుల్లో భాగంగా గంపలగూడెం మండలం కొత్తపల్లి, వినగడప్లల్లో ఆదివారం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, రాబడి సాధించాలన్నారు. కంపెనీ ప్రతినిధులు సుబ్రమణియన్, వెంకటేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

ఫైనల్ మ్యాచ్ కోసం బిగ్‌స్క్రీన్ ఏర్పాటు



నూజివీడు: క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు వీక్షించేందుకు వీలుగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయించారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో శ్రీనివాస సెంటర్‌లో ఈ బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేయగా వేలాది మంది క్రికెట్ అభిమానులు ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతాలు ఆదివారం జరిగాయి. ఆలయ అర్చకులు మాట్లాడుతూ కార్తిక మాసంలో ప్రతిఒక్కరూ సత్యనారాయణ వ్రతాలు చేసుకోవాలని సదవకాశం కల్పించామన్నారు. ప్రతి ఏటా సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు.

